
సాక్షి చిత్తూరు
గురువారం । 9 । జనవరి । 2025



తీవ్ర కరువుమండలంగా గుడిపాల

గుడిపాలను తీవ్ర కరువు మండలంగా గుర్తించామని కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ సభ్యులు ప్రదీప్‌కుమార్ తెలిపారు. - 8లో



గురువులకు సర్కారు 'ట్విస్ట్'

రాష్ట్ర ప్రభుత్వం టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్) పేరుతో వివరాలు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. - 8లో



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం 66,566 దర్శనం చేసుకోగా, టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

విద్యుత్ బిల్లు భారం నుంచి ఉపశమనం

సాక్షి ఎఫెక్ట్..



RESCO LIMITED KUPPAM
PAYMENT RECEIPT
DT:05-01-2025T11:10:56:42
PR: SPMT -00011025-00795
SERVICE NO : 00598
DIST NAME : M K PURAM
NAME : RAMESH G
CATG NAME : DOMESTIC
SLAB AMNT : 1500.00
ARREAR AMNT : 0.00
SURCHG AMNT : 0.00
REC AMNT : 0.00
TOTAL AMOUNT: 1500.00

బిల్లు చెల్లించిన రసీదు

శాంతిపురం: తప్పుడు విద్యుత్ వ్యవహారాన్ని సాక్షి దినపత్రిక వెలుగులోకి తేవడంతో వినియోగదారుడికి ఉపశమనం లభించింది. మండలంలోని ఎంకే పురానికి చెందిన గజ్జల రమేష్‌కు ఐదు నెలల్లో 42 యూనిట్ల విద్యుత్ వినియోగానికిగాను రూ.20.800 బిల్లును రెస్కో సిబ్బంది ఇచ్చారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై గత నెల 27వ తేదీన సాక్షి దినపత్రికలో '42 యూనిట్లకు రూ.20.800' శీర్షిన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన రెస్కో అధికారులు రూ.1,500కు బిల్లును సవరించి, ఆ మేరకు వినియోగదారుడి నుంచి వసూలు చేశారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

– వీడియో సమావేశంలో సీడీఎంఏ హరినారాయణన్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ, కమిషనర్

చిత్తూరు అర్బన్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజల సమస్యలు పరిష్కరించడంపై కమిషనర్లు దృష్టి సారించాలని రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం ఆయన మంగళగిరి నుంచి వీడియో సమావేశం నిర్వహించగా.. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అనంతపురం ఆర్డీ విశ్వనాథ్, కమిషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వేసవి వస్తున్న దృష్ట్యా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటికప్పుడు ప్రత్యామ్నాయ సమస్యలను వెతుక్కోకుండా.. ఇప్పటి నుంచే ఓ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్లాలన్నారు. అన్నా క్యాంటీన్లను కమిషనర్లందరూ రోజూ పరిశీలించాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ, ఆస్తిపన్ను వసూలు, గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు సహాయ కమిషనర్ ప్రసాద్, మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

హరి.. హరీ!

- వైకుంఠ ద్వార దర్శనం టికెట్లకు పోటెత్తిన భక్తులు
- తూతూమంత్రంగా ఏర్పాట్లు చేసిన టీటీడీ అధికారులు
- క్యూల నియంత్రణలో విఫలమైన పోలీసులు
- తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన పలువురు భక్తులు
- గాయపడిన వారితో నిండిపోయిన ఆస్పత్రులు

నిలబడలేం.. కూర్చోలేం.. ఒకే చోట పడిగాపులు.. కనీస వసతులు లేవు.. అన్నపానీయాలు అందలేదు.. పట్టించుకునేవారు లేరు.. వైకుంఠ ద్వార దర్శనార్థం వచ్చిన భక్తులతో టీటీడీ అధికారులు దారుణంగా వ్యవహరించారు. వీధులనే క్యూలుగా మార్చి అందులో తోసేశారు.. పిల్లలు.. పెద్దలు.. మహిళలనే జ్ఞానం లేకుండా ఇష్టారాజ్యంగా నెట్టేశారు. ఏమాత్రం నియంత్రణ పాటించకుండా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. కౌంటర్ల వద్ద తూతూమంత్రంగా భద్రత కల్పించారు. టోకెన్ తీసుకునేందుకు పోటీపడే దుస్థితిని తీసుకువచ్చారు. వారి నిర్లక్ష్యం కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. పెద్దసంఖ్యలో గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. చివరకు సహాయక చర్యల్లోనూ అధికారులు అలసత్వం ప్రదర్శించారు. సకాలంలో వైద్యసేవలందించడంలోనూ వైఫల్యం చెందారు.

– తిరుపతి సిటీ/క్రైం/మంగళం/కల్చరల్/అర్బన్







తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి వద్ద రోడ్డుపై భక్తుల పడిగాపులు



రోడ్డుపైనే నిద్రిస్తూ..



పోలీసు వలయం ఛేదిస్తూ..



క్యూగా మారిన వీధిలో తొక్కుకుంటూ.. తోసుకుంటూ..

టీటీడీదే బాధ్యత



పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయని టీటీడీ అధికారులే ఈ ఘోరానికి బాధ్యత వహించాలి. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తుల ప్రాణాలతో చెలగాటమాడారు. ఇంత మంది తీవ్రంగా గాయపడేందుకు కారణమయ్యారు. పోలీసులు సైతం అత్యంత బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించారు. ఈక్రమంలో ప్రభుత్వం స్పందించాలి. బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి.

– మురళి, జిల్లా కార్యదర్శి, సీపీఐ

ప్రాణాలతో చెలగాటం



టీటీడీ అధికారులు శ్రీవారి భక్తుల ప్రాణాలతో చెలగాటమాడారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు పంపిణీ చేసేందుకు పది రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నామంటూ ప్రకటనలు గుప్పించారు. చివరకు చేసింది ఇదా. ఇంతమంది ప్రాణాలకు ఎసరు పెడతారా. ఈ ఘోరానికి కారకులను వదిలి పెట్టకూడదు. కఠినంగా శిక్షించాలి. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి.

– వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి, సీపీఎం

పరిహారం చెల్లించాలి



టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇన్ని ప్రాణాలు పోయాయి. బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలి. ఘటనకు కారకులైన పోలీసులపై చర్యలు చేపట్టాలి. శ్రీవారి భక్తులను ఇంతగా ఇబ్బంది పెట్టినందుకు టీటీడీ బోర్డు వెంటనే దిగిపోవాలి. ఈఓ, అదనపు ఈఓ బాధ్యత తీసుకోవాలి. భక్తులకు సేవ చేయాల్సిన అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు.

– కందారపు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ

విచారకరం



భక్తుల రద్దీకి తగ్గట్టు టీటీడీ అధికారులు ఏర్పాటు చేయలేదు. ఇంత పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తే కనీస వసతులు కూడా కల్పించలేదు. పైగా క్యూల నిర్వహణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. భక్తులను క్యూలోకి వదిలేశారే కానీ, అన్నప్రసాదాలు సైతం అందించలేదు. అసలు తొక్కిసలాటకు పోలీసుల వైఖరే కారణం. భక్తులను నిర్దాక్షిణ్యంగా ఒకరిపై ఒకరిని నెట్టేశారు. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సిన దుస్థితి దాపురించింది.

– రాజగోపాల్ రెడ్డి, భక్తుడు, వేంపల్లె

ప్రాణాల మీదకు తెచ్చారు



వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకుందామని కుటుంబంతో కలిసి వస్తే ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. టీటీడీ అధికారులు ఏమాత్రం ఏర్పాట్లు చేయలేదు. క్యూలోకి తోసేసి పట్టించుకోలేదు. ఇక పోలీసులైతే చాలా దురుసుగా ప్రవర్తించారు. వారి వ్యవహార శైలే ఇంతమంది ప్రాణాల మీదకు తెచ్చింది. మా కళ్ల ముందే చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించడంలో కూడా ఆలస్యం చేశారు.

– కేశవన్, భక్తుడు, మధురై, తమిళనాడు

రోవర్లు లేవీ.. సర్వేశ్వరా..!

బ్రిటిష్‌కాలం నాటి సర్వే.. నేటికీ అదే ఆచరణతో భూ తగాదాలు.. రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ ప్రదక్షణలు.. ఇదీ దశాబ్దాల భారతం.. ఎక్కడో ఓ చోట దీనికి అడ్డుకట్ట వేయాలన్నది గత వైఎస్సార్ సీపీ నిర్ణయం. దీనిపై కూటమి నాడు రాద్ధాంతం.. నేడు రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం.. అయితే పరికరాలు లేకనే చేయాలని ఆదేశం.. ఎలా చేయాలి సర్వేశ్వరా? అని సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.



రీ సర్వేకి అవసరమైన రోవర్

జిల్లా సమాచారం

జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు	822
వైఎస్సార్‌సీపీ పాలనలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాలు	329
ప్రస్తుతం రీ సర్వే జరిగే గ్రామాలు	31
ప్రస్తుతం రీ సర్వే చేయనున్న విస్తీర్ణం	30,850 ఎకరాలు
జిల్లా మొత్తం భూ విస్తీర్ణం	13,02,228.96 ఎకరాలు
గత వైఎస్సార్‌సీపీ సర్కారులో రీ సర్వే పూర్తి చేసిన ఎకరాలు	3,02,555.56 ఎకరాలు
చిత్తూరు డివిజన్‌లో రీ సర్వే పూర్తయిన గ్రామాలు	113
నగరి డివిజన్‌లో రీ సర్వే పూర్తయిన గ్రామాలు	44
పలమనేరు డివిజన్‌లో రీ సర్వే పూర్తయిన గ్రామాలు	68
కుప్పం డివిజన్‌లో రీ సర్వే పూర్తయిన గ్రామాలు	104

- జిల్లాలో రీ సర్వే పునఃప్రారంభానికి సన్నాహాలు
- గత వైఎస్సార్‌సీపీ సర్కారులో విజయవంతంగా రీ సర్వే
- ప్రస్తుత రీ సర్వేకి రోవర్లు, ల్యాప్‌టాప్‌ల కొరత
- జిల్లాలో 31 గ్రామాల్లో రీ సర్వేకి అధికారుల కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 31 గ్రామాల్లో రీ సర్వేను తిరిగి పునఃప్రారంభించేందుకు అధికారిక యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. అయితే ఈ రీ సర్వేకి ముఖ్యమైన రోవర్లు, ల్యాప్‌టాప్‌లు కొరత ఏర్పడింది. దీంతో రీ సర్వే ఎంత పకడ్బందీగా చేపడుతారోనని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు రీ సర్వేపై పలు అసత్య ఆరోపణలు చేశారు. వాస్తవాలకు మసి పూసి మారేడు కాయ చేసి, ప్రజలను మోసం చేసేలా అసత్య ప్రచారాలు చేసి మోసగించారు. రీ సర్వేలో భాగమైన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో భూములు లాగేసుకున్నారని, కబ్జా చేశారని, విస్తీర్ణం తగ్గించేశారని, రికార్డులు ట్యాంపర్ చేశారంటూ ఎన్నికల సమయంలో అనేక ఆరోపణలు చేశారు. భూ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై అభూతకల్పనలు సృష్టించి, దాన్ని రద్దు చేస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న రీ సర్వే పనులను నిలిపివేశారు. సర్వేలో తప్పులు జరిగాయని, వాటిని సరి చేస్తున్నట్లు హడావుడి చేశారు.

మండలానికో గ్రామం చొప్పున ఎంపిక

గత వైఎస్సార్ సీపీ సర్కారు శ్రీకారం చుట్టిన భూముల రీ సర్వేని ప్రస్తుత కూటమి సర్కారు తిరిగి పునఃప్రారంభిస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో జిల్లాలోని ప్రతి మండలంలో ఒక్క గ్రామాన్ని ఎంపిక చేశారు. మొత్తం 30,850 ఎకరాల్లో రీ సర్వే చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సర్వే కోసం ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్వోతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క బృందం రోజుకు 20 ఎకరాలు సర్వే చేసి, అదే రోజు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

రోవర్లు, ల్యాప్‌టాప్‌ల కొరత

రీ సర్వే నిర్వహణకు రోవర్లు, ల్యాప్‌టాప్‌లు కొరత ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న రీ సర్వేకి ప్రతి బృందానికి తప్పనిసరిగా రోవర్, ల్యాప్‌టాప్ ఉండాలి. ప్రతి బృందానికి ఒక రోవర్ చొప్పున పరిగణలోకి తీసుకుంటే దాదాపు 100 వరకు రోవర్లు అవసరం ఉంటుంది. 55 రోవర్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయికి వెళితేకానీ ఎన్ని పనిచేస్తాయో తెలియని పరిస్థితి ఉందని సిబ్బంది వెల్లడిస్తున్నారు. రీ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు తగినన్ని రోవర్లు లేకపోవడంతో అసలు ప్రారంభంలోనే రీ సర్వేకి ఆటంకం కలుగుతోంది. రోవర్లు ఒక్కటే కాదు..సిబ్బందికి తగినన్ని ల్యాప్‌టాప్‌లు సైతం లేవని తెలుస్తోంది. రోవర్లు, ల్యాప్‌టాప్‌లు లేకుండా రీ సర్వే ఎలా కొనసాగిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ సర్కారులో 329 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

జిల్లా వ్యాప్తంగా 822 రెవెన్యూ గ్రామాలున్నాయి. మొత్తం విస్తీర్ణం 13,02,228.96 ఎకరాలు ఉంది. అందులో 329 రెవెన్యూ గ్రామాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రీ సర్వేని పూర్తి చేయగా, మిగిలిన 493 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాల్సి ఉంది. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పరిపాలనలో 329 రెవెన్యూ గ్రామాల్లో 3,02,555.56 ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశారు. 3,25,897 ఎల్‌పీఎం (సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీఎం నంబర్లను ప్రవేశపెట్టారు). 33,30,666 సర్వే రాళ్లను నాటించారు.

సర్వే పకడ్బందీగా చేస్తే చాలు



మాది వెదురుకుప్పం మండలం చిన్ననక్కలాంపల్లి గ్రామం. మాకు 18.08 ఎకరాల భూమి ఉంది. మా పూర్వీకుల నుంచి వస్తున్న భూమి అది. ఆ భూమిలోనే పంటలు పండించుకుని జీవనాధారం పొందుతున్నాం. ముందున్న ప్రభుత్వంలో రీ సర్వే పకడ్బందీగా నిర్వహించారు. ఈ ప్రభుత్వం వచ్చాకా ఎందుకో రీ సర్వే ఆపేశారు. మా భూమికి సర్వే నంబర్ లేక చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. సర్వే చేసి హద్దులు గుర్తించి సర్వే నంబర్ ఇవ్వాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చాను. ఇప్పుడేమో రీ సర్వే మళ్లీ ప్రారంభిస్తారని చెబుతున్నారు. ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించి నాకు న్యాయం చేస్తే చాలు.

– నీలావతి, వెదురుకుప్పం మండలం

సమీక్ష.. ఏంటీ శిక్ష!

నిత్యం విధి నిర్వహణలో బిజీ ఉంటాం. అహర్నిశలు ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేస్తుంటాం. వివిధ అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాల అమలుపై నివేదికలు అందిస్తుంటాం. అలాగే వీడియో కాన్ఫరెన్స్‌లు.. టెలీ కాన్ఫరెన్స్‌లతో ఊపిరి తీసుకునే అవకాశం కూడా లేకుండా పనిచేస్తుంటాం. ఇదంతా మా బాధ్యతలు నెరవేర్చడంలో భాగం. సంతోషంగా ఆ పనులు పూర్తి చేస్తాం. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టే సమావేశాలతోనే అసలు తంటా వస్తోంది అంటూ అధికారులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. కుప్పం వచ్చిన ప్రతిసారీ అర్ధరాత్రి వరకు సమీక్షించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో అలసిసొలసిన సమయంలో మీటింగ్ ఏర్పాటు చేసి గంటల తరబడి సాగదీయడంపై ఆందోళన చెందుతున్నారు.

- సీఎం చంద్రబాబు తీరుతో అధికారుల అవస్థలు
- అర్ధరాత్రి వరకు సమావేశాలపై ఆవేదన



సాక్షి టాస్క్‌ఫోర్స్ : సీఎం చంద్రబాబు కుప్పంలో అర్ధరాత్రి వరకు సమీక్షా సమావేశం నిర్వహించడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా సీఎం పర్యటనలో అలసిపోయిన తర్వాత మళ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడం సరికాదని తీవ్రంగా తప్పుపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పర్యటించిన విషయం తెలిసిందే. సీఎం పర్యటన ఖరారైనప్పటి నుంచి కలెక్టర్, ఎస్పీతోపాటు అన్ని శాఖల అధికారులు వారం రోజులుగా కుప్పంలోనే తిష్టవేశారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ ఇప్పటి వరకు జరిగిన పనులు, అవసరమైనవి, పూర్తి చేయవలసినవి, అవసరమైన నిధులపై నివేదికలు సిద్ధం చేశారు. సోమవారం మధ్యాహ్నం కుప్పానికి చేరుకున్న సీఎం చంద్రబాబు మొదటి రోజు కార్యక్రమాలన్నీ పూర్తయ్యేసరికి అర్ధరాత్రి అయ్యింది. మరుసటి రోజు మంగళవారం సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. అన్నీ ముగించుకుని రాత్రి 10 గంటలకు ద్రవిడ యూనివర్సిటీలోని సెమినార్ హాలుకి చేరుకుని అధికారులతో సమీక్ష సమావేశం ప్రారంభించారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం రాత్రి 7.30 గంటలకు సమీక్ష పూర్తి కావాల్సి ఉంది. కానీ, రాత్రి 10 తర్వాత ప్రారంభమైన సమావేశం 12.20 గంటల వరకు సాగింది.

ఇవేం కష్టాలు బాబోయ్!

ముఖ్యమంత్రి సమావేశానికి సీనియర్ అధికారులు, పిల్లలు ఉన్న తల్లులు హాజరైనట్లు తెలిసింది. రాత్రి 7.30 గంటలకు మీటింగ్ ముగుస్తుందని, ఇళ్లకు వెళ్లిపోవచ్చని భావించారు. అయితే అర్ధరాత్రి దాటే వరకు సమావేశం కొనసాగించడంతో పలువురు అధికారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుధవారం ఎటువంటి కార్యక్రమాలు లేకపోయినా ఎక్కువ మంది అధికారులు ప్రొటోకాల్ ప్రకారం సీఎం చంద్రబాబు బయలుదేరే సమయం వరకు కుప్పంలోనే ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఇవేం కష్టాలు బాబోయ్ అని అధికారులు చర్చించుకోవడం గమనార్హం.

క్లుప్తంగా

వరసిద్ధుడికి రూ.2.50 లక్షల విరాళం



ఆలయాధికారులకు చెక్కు అందజేస్తున్న దాత

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయాభివృద్ధికి బుధవారం ఓ దాత రూ.2.50 లక్షల విరాళం ఇచ్చారు. తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన దాసరి రామ్‌ప్రసాద్ ఈ నగదు చెక్కును ఆలయాధికారులకు అందజేశారు. అనంతరం ఆయనకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



మంజువాణిని సన్మానిస్తున్న ఎంఈఓలు, సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా పులిచెర్ల మండలంలోని కావేటిగారిపల్లె ప్రధానోపాధ్యాయురాలు మంజువాణి అవార్డు అందుకున్నారు. బుధవారం ఎమ్మార్సీలో ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు.

బాబుకు సాదర వీడ్కోలు



సీఎం వీడ్కోలు పలుకుతున్న అధికారులు,నేతలు

కుప్పం:నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన సీఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు పలికారు. ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఫిర్యాదులు స్వీకరించి 12.40 గంటలకు ద్రావిడ వర్సిటీ వద్ద ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఎస్పీ మణికంఠ చందోలు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, టీడీపీ పాలకవర్గసభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు యథాతథం

– డీవీఈఓ. సయ్యద్ మౌలా



డీవీఈఓ సయ్యద్ మౌలా

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు యథాతథంగా నిర్వహిస్తారని ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రద్దు చేశారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ప్రచారాలు అవాస్తవమన్నారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ రాష్ట్ర అధికారులు సైతం ధ్రువీకరించారన్నారు. జనవరి 26వ తేదీ లోపు ఇంటర్ సంస్కరణలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఈ ఏడాది పరీక్షలు రద్దు అనే విషయం అవాస్తవమన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు అసత్యప్రచారాలను నమ్మకూడదని డీవీఈఓ తెలిపారు.

గురువులకు సర్కారు ట్విస్ట్



విద్యార్థి జీవితంలో పది పరీక్షలు ఎంతో కీలకం.. ఈ తరగతిలో వచ్చే మార్కులే అతడి భవితకు ఆధారం. ఇలాంటి పరీక్షలకు మూడు నెలలు మాత్రమే ఉన్న సమయం.. ఇది వెనుకబడిన విద్యార్థికి ప్రత్యేక శిక్షణ, పాఠ్యాంశాల పునశ్చరణకు ఎంతో విలువైన కాలం.. ఈ తరుణంలో కూటమి సర్కారు గురువులకు టిస్ పేరుతో ట్విస్ట్ పెడుతోంది. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించలేక, తమ వ్యక్తిగత సమాచారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేక సతమతమవుతున్నారు.

పది పరీక్షల వేళ నేర్వని పాఠం

- టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సమాచార నిధి సేకరణ
- వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు
- సెలవుల్లో ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వాలంటున్న ఉపాధ్యాయులు
- పాఠ్యప్రణాళికలను పక్కదారి పట్టించేలా చేస్తున్నారని ఆగ్రహం
- వివరాల నమోదులో సర్వర్ సమస్యలు
- తలలు పట్టుకుంటున్న గురువులు

చిత్తూరు కలెక్టరేట్:చిత్తూరు జిల్లాలో 2,499, తిరుపతి జిల్లాలో 3,063 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. చిత్తూరు జిల్లాలో 9,162 మంది, తిరుపతి జిల్లాలో 10,158 మంది టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బదిలీలు.. పదోన్నతుల వంటివి పారదర్శకంగా నిర్వహించేందుకు టిస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ కసరత్తులో ప్రతి ఉపాధ్యాయుని వ్యక్తిగత, వృత్తిపరమైన వివరాలను టీచర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం(టిస్)లో నమోదు చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు.

తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

వేసవి సెలవుల్లో నిర్వహించాల్సిన కసరత్తులను విద్యాసంవత్సరం జరిగే సమయంలో చేపట్టడంపై ఉపాధ్యాయులు గుర్రుమంటున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మూడు నెలల సమయం మాత్రమే ఉండడంతో పాఠ్యాంశాల పునశ్చరణ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడిస్తున్నారు. అలాగే మిగిలిన తరగతులు సిలబస్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందంటున్నారు. ఇలాంటి సమయంలో టిస్ వివరాల నమోదుకు ప్రత్యేక సమయం కేటాయించాల్సి ఉంటుందన్నారు. వివరాలు నమోదు చేసేందుకు చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. టిస్‌లో వివరాల నమోదుపై ఎలాంటి అవగాహన కల్పించకుండానే వెంటనే చేయాలని ఉత్తర్వులివ్వడం సరైన పద్ధతి కాదని చెబుతున్నారు. వివరాల నమోదుకు సంబంధించి వివరాలు ఎలా నమోదు చేయాలోనని టీచర్లు తలలు పట్టుకుంటున్నారు.

కూటమి పాలనలో వింత పోకడలు

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాశాఖలో వింత పోకడలు అమలవుతున్నాయని విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో విద్యాభివృద్ధికి సంబంధించి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో టిస్ అనే యాప్‌లోకి వెళ్లి టీచర్ల వ్యక్తిగత, వృత్తిపరమైన సమాచారం అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 23వ తేదీ సాయంత్రం వివరాల నమోదుకు మాడ్యూల్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆన్‌లైన్‌లో టిస్ వివరాల నమోదులో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫొటో అప్‌లోడ్ వద్ద మరొకరి ఫొటో అప్‌లోడ్ అవ్వడం, వివరాలు సరిగ్గా నమోదు కాకపోవడం జరుగుతోంది. వివరాల నమోదు కోసం టీచర్లు పనివేళలు మానుకుని విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రతి అంశం నమోదు చేయాల్సిందే

టిస్ కసరత్తులో ప్రతీ టీచర్ తన వ్యక్తిగత వివరాల్లో పుట్టిన ఊరు, తేదీ, తల్లిదండ్రులు, పిల్లల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఏ డీఎస్సీ ద్వారా ఉద్యోగం వచ్చింది? ఏ సబ్జెక్టులో ఎంపికయ్యారు? ఎప్పుడు చేరారు? విద్యార్హతలు.. పదోన్నతులు ఏ కేటగిరీ నుంచి పొందారు? ఇప్పటి వరకు ఎక్కడెక్కడ పని చేశారు? వచ్చిన అవార్డులు, రివార్డుల వివరాలతోపాటు రిజర్వేషన్ ఉంటే అవీ నమోదు చేయాలి. దివ్యాంగులైతే సర్టిఫికెట్ స్కాన్ చేసి జతపరచాలి. అవివాహితులైతే ఆ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. అనారోగ్య సమస్యలున్నా తెలియజేసి, వైద్యుల నివేదికలను సమర్పించాలి. ఉపాధ్యాయులు ఇచ్చిన సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ధ్రువీకరించాలి. ఎవరైనా తప్పుడు సమాచారం ఇస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యాశాఖ. ఎస్‌సీఈఆర్టీ నిర్వహించిన శిక్షణకు హాజరైతే ఆ వివరాలు పేర్కొనాలి.

చిత్తూరు జిల్లా వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	1,909
ప్రాథమికోన్నత పాఠశాలలు	205
ఉన్నత పాఠశాలలు	355
మొత్తం పాఠశాలలు	2,469
విధులు నిర్వహిస్తున్న టీచర్లు	9,162

తిరుపతి జిల్లా వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	1,844
ప్రాథమికోన్నత పాఠశాలలు	188
ఉన్నత పాఠశాలలు	322
మొత్తం పాఠశాలలు	2,354
విధులు నిర్వహిస్తున్న టీచర్లు	10,158

19,320 మంది టీచర్ల వివరాలు నమోదు చేయాల్సిందే

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 19,320 మంది ఉపాధ్యాయుల వివరాలు తప్పక నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు వారం రోజులు గడువు విధించారు. వారం రోజుల్లోపు వివరాలన్నీ నమోదు చేయాలంటే సాధ్యపడదని టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ సమయంలో వివరాల నమోదులో తప్పిదాలు చోటు చేసుకుంటే సమస్యలు ఎదురవుతాయని టీచర్లు వెల్లడిస్తున్నారు.

ఇలాంటి సమయంలో కరెక్టు కాదు



ఇలాంటి సమయంలో టిస్ కార్యక్రమాలు నిర్వహించడం కరెక్టు కాదు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో టిస్ కసరత్తు నిర్వహించడం సరైన పద్ధతి కాదు. అతి తక్కువ సమయం ఇచ్చి వివరాలు వెంటనే నమోదు చేయాలంటే ఎలా చేస్తారు. తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటామంటారు. టీచర్లనే బాధ్యులు చేస్తారు. సెలవు రోజుల్లో ఇలాంటి కసరత్తులు చేపడితే పారదర్శకంగా ఉంటుంది. – బాలాజీ, ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

సెలవుల్లో నిర్వహించాలి



టిస్ కార్యక్రమాన్ని సెలవుల్లో నిర్వహించాలి. వివరాలు నమోదు చేసేందుకు సమయం ఎక్కువగా పడుతుంది. టెక్నాలజీపై పట్టు లేని వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. టిస్ కార్యక్రమంలో ప్రతి అంశాన్ని పకడ్బందీగా నమోదు చేయాల్సిందే. ఇలాంటి తరుణంలో సమయం ఎక్కువగా ఉంటే పారదర్శకంగా వివరాలను నమోదు చేసేందుకు అవకాశం ఉంటుంది. – వినాయకం, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

11న ఎక్సైజ్‌శాఖలో వస్తువుల వేలం

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖకు చెందిన పలు వస్తువుల విక్రయానికి ఈ నెల 11వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఏపీబీసీఎల్ చిత్తూరు డిపో మేనేజరు మనోహర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉపయోగించిన ఫ్రీజర్లు, ఇన్‌వర్టర్–బ్యాటరీలు, నగదు బాక్సులు, స్కానర్లు, నగదు లెక్కించే యంత్రాలను విక్రయించడానికి బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు పూతలపట్టులోని బండపల్లె మద్యం డిపో ప్రాంగణంలో రూ.5 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల వారు 9177887729, 7780566131 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పీఆర్సీ త్వరగా అమలు చేయాలి

– సీఎంకు వినతిపత్రం అందజేత



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న జయప్రకాష్‌నాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల పీఆర్సీని త్వరతిగతిన అమలు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుప్పం పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల వేతనాల పెంపునకు పే రివిజన్ కమిషన్(పీఆర్సీ)ని వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ డీఏల మొత్తం విడుదల చేయాలని కోరారు. ఎంటీఎస్ టీచర్లకు గత 12 నెలలుగా జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించి, ఆ కళాశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం సీఎం చేతుల మీదుగా అసోసియేషన్ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందనం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



వెంకటరమణమూర్తి

చిత్తూరు కార్పొరేషన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా గ్రూప్–1 అధికారి వెంకటరమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆడిట్ డీఆర్ మునిశంకరయ్య, సబ్‌రిజిస్ట్రార్లు, ఉద్యోగులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వినియోగదారులకు రిజిస్ట్రేషన్ శాఖ సేవలను మెరుగ్గా అందించడానికి కృషి చేస్తానన్నారు. రిజిస్ట్రేషన్‌శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌గా గ్రూప్–1 అధికారిని నియమించడం ఇదే ప్రథమం. విజయనగరం జిల్లా గుర్ల మండలానికి చెందిన తాను 2023లో గ్రూప్–1కు ఎంపికయ్యానన్నారు. మొదట వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శిగా విశాఖలో పనిచేశానన్నారు. గత ఏడాది విజయ నగరం జిల్లా రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ పొంది శిక్షణలో తీసుకున్నా నన్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో పోస్టింగ్ వచ్చిందన్నారు.

అరుదైన వ్యాధితో ఇంటర్ విద్యార్థి మృతి



మనోజ్ (ఫైల్)

సదుం: అరుదైన ఎస్‌ఎల్‌ఈ వ్యాధితో బాధపడుతూ సదుం మండలానికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థి మంగళవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. జోగివారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు మనోజ్(16) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గత కొన్నాళ్లుగా ఎస్‌ఎల్‌ఈ వ్యాధికి తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సిస్టమిక్ లూపస్ ఎరిథెమాటోసస్(ఎస్‌ఎల్‌ఈ) అనేది అరుదైన వ్యాధి అని వైద్యులు తెలిపారు. 14 నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలకే వస్తుందని, అరుదుగా బాలికలకు వస్తుందని తెలిపారు. చాలా తక్కువ మంది బాలురకు వస్తుందని తెలిపారు. మొదటి దశలో ముఖంపైన చర్మ సమస్యలు వస్తాయన్నారు. దీన్ని డెర్మటాలజిస్టులు కనిపెట్టవచ్చన్నారు. రెండో దశలో మెదడు, గుండెకు సమస్యలు వస్తాయని, మూడో దశలో కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. మొదటి దశలో గుర్తిస్తే చికిత్స నయం చేసుకునే అవకాశాలున్నాయని, మూడో దశకు చేరుకుంటే చికిత్స అందుబాటులో లేదని తెలిపారు. కాగా మనోజ్‌కు బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

బస్సు బోల్తా



బోల్తా పడిన బస్సు

వి.కోట: టూరిస్టు బస్సు అదుపు తప్పి బోల్తా పడి, పది మంది గాయపడిన ఘటన వి.కోట – పేర్నంబట్ జాతీయ రహదారిలోని ఆంధ్రా, తమిళనాడు సరిహద్దులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటక నుంచి వి.కోట మీదుగా తమిళనాడుకు ఓంశక్తి భక్తుల టూరిస్టు బస్సు బయలుదేరారు. ఆంధ్రా సరిహద్దు దాటిన తర్వాత వచ్చే మొదటి ఘాట్‌లోనే ప్రమాదవశాత్తు బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న వారిలో 10 మందికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని తమిళనాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తమిళనాడు పోలీసులు చర్యలు తీసుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి అతివేగమే కారణమని ప్రయాణికులు తెలిపారు.

రేపటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

- సెలవుల్లో బడులు నిర్వహిస్తే సీజ్ చేస్తాం
- డీఈఓ వరలక్ష్మి హెచ్చరిక



మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024–25 అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సంక్రాంతి సెలవుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలులో ఉంటుందన్నారు. ఈ నెల 10 నుంచి 12 వ తేదీ వరకు (సెల్ఫ్ ప్రిపరేషన్ అట్ హోమ్), ఈ నెల 13 నుంచి 15 వ తేదీ వరకు ఎలాంటి యాక్షన్ ప్లాన్ ఉండదన్నారు. ఈ నెల 16 వ తేదీ నుంచి 19 వ తేదీ వరకు (సెల్ఫ్ ప్రిపరేషన్ అట్ హోమ్) ఉంటుందన్నారు. ఈ నెల 20వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు. జిల్లాలోని మైనారిటీ విద్యాసంస్థలకు మాత్రం ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు మాత్రం సెలవులుంటాయన్నారు. ప్రకటించిన సెలవుల్లో ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తే అనుమతులు రద్దు చేసి పాఠశాలలు సీజ్ చేస్తామని డీఈఓ హెచ్చరించారు.

మేం చెప్పే పనులు చేయకపోతే సెలవు పెట్టి వెళ్లిపో!



పుంగనూరు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న టీడీపీ చోటా నేతలు

- మున్సిపల్ కమిషనర్‌కు అధికార పార్టీ చోటా నేత హెచ్చరిక
- కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా
- అధికార పార్టీ గ్రూపులతో అధికారుల బేజారు

పుంగనూరు: 'చట్టాలతో మాకు పనిలేదు.. మేం చెప్పే పనులు చేయాలి... ప్రొటోకాల్ ప్రకారం మమ్మల్ని గౌరవించాలి.. లేదంటే నువ్వు సెలవు పెట్టి వెళ్లిపో... లేదా ట్రాన్స్‌ఫర్ చేసుకో...'' అంటూ టీడీపీకి చెందిన ఓ వర్గం చోటా నేతలు పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌ను హెచ్చరించి, కార్యాలయం వద్ద బుధవారం బైఠాయించి ధర్నా చేశారు. కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని దూషిస్తూ నినాదాలు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది విస్తుపోయారు. వివరాల్లోకి వెళితే.. పుంగనూరు పట్టణానికి చెందిన ఓ చోటా టీడీపీ నేత తన అనుచరులతో కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని కలిశారు. తమకు ప్రొటోకాల్ ప్రకారం గౌరవం ఇవ్వాలని, అన్ని పనులు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు లోబడి అన్ని పనులు చేస్తామని, ప్రొటోకాల్ నిబంధనల మేరకు అమలు చేస్తామని కమిషనర్ తెలిపినట్లు సమాచారం. దీనిపై ఆ నాయకుడు ఆగ్రహించి «మాకు గౌరవం ఇవ్వరా...సెలవు పెట్టి వెళ్లిపో.. లేదా ట్రాన్స్‌ఫర్ చేసుకో అంటూ హెచ్చరిస్తూ కమిషనర్ చాంబర్ నుంచి ఆగ్రహంతో బయటకు వెళ్లిపోయాడని సమాచారం. వెంటనే మున్సిపాలిటీ కార్యాలయం ముందు బైఠాయించారు. 'కమిషనర్ డౌన్.. డౌన్... కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి.. నియోజకవర్గ ఇన్‌చార్జ్ లెటర్ గౌరవించరా..' అంటూ అనేక దుర్భాషలాడుతూ నినాదాలు చేశారు. ఈ విషయమై సీఎం దృష్టికి తీసుకెళతామని కమిషనర్‌ను హెచ్చరించి వెళ్లిపోయారు. ఈ తతంగమంతా చూసిన సిబ్బంది, అధికారులు విస్తుపోయారు. అధికార పార్టీకి చెందిన నాయకుడు కమిషనర్‌పై ఒక వర్గం ఆరోపణలు చేయడంతో మిగిలిన వర్గం కమిషనర్‌కు అండగా నిలిచారని సమాచారం. చోటా నేతల ఆరోపణలపై కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లెటర్ తమకు ఇవ్వలేదని, సమస్య ఏమీ చెప్పలేదని, ఇది ఆరోపణ మాత్రమేనన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేసినా స్పందించి, సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే నిబంధనల మేరకు ప్రొటోకాల్ అమలు చేస్తామని తెలిపారు. నిజాయితీగా పనిచేస్తుంటే కార్యాలయం ముందు ధర్నా చేయడం, విధులకు ఆటంకం కలిగించడం మంచి పద్ధతి కాదని తెలిపారు.

తీవ్ర కరువు మండలంగా గుడిపాల

- కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ సభ్యుడు ప్రదీప్‌కుమార్



గుడిపాల: పొలాలను సందర్శిస్తున్న ప్రదీప్‌కుమార్

గుడిపాల: రైతులతో మాట్లాడిన తరువాత గుడిపాలను తీవ్ర కరువు మండలంగా గుర్తించామని కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ సభ్యులు ప్రదీప్‌కుమార్ తెలిపారు. బుధవారం 190 రామాపురంలో 2024 ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసిన రైతుల పొలాలను కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ సభ్యుడు ప్రదీప్‌కుమార్ సందర్శించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు ఆయనతో మాట్లాడుతూ వర్షాలు లేకపోవడంతో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతినిందని, దీంతో ప్రస్తుతం ప్రత్యామ్నాయంగా ఉలవ పంట సాగు చేశామని తెలిపారు. సుమారు 10 మంది రైతుల పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేరుశనగ పంటతో చాలా నష్టపోయారన్నారు. పొలాలను సందర్శిస్తే చాలా విషయాలు తెలిశాయని చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాల వైపు రైతులు వెళ్లాలన్నారు. ఉద్యానవనశాఖతో సమన్వయం చేసుకుని భూసార పరీక్షల అనంతరం అనువైన వర్షాధార పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం కొంతమంది రైతులు తమ సమస్యలపై ఆయనకు అర్జీలు అందజేశారు. తరువాత వేరుశనగ పంట నష్టం ఫొటో ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డీఎం అండ్ ఎఫ్‌డబ్ల్యూ దీపాంకర్‌సేత్, లైవ్‌స్టాక్ హెల్త్ అసిస్టెంట్ కమిషనర్ మన్నుజీ ఉపాధ్యాయ్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి, వెటర్నరీ డీడీ ప్రభాకర్, ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా గ్రౌండ్‌వాటర్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, డీఈలు ప్రసాద్, రవికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శివరాజన్, వ్యవసాయాధికారి మాధవి పాల్గొన్నారు.

ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నగరి : ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికల నిర్వహించినట్లు ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. బాలాజి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 ఉమ్మడి జిల్లాలకు సంబంధించి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారన్నారు. బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి వై. రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పరిశీలకులు ఆర్కె ఎత్తిరాజ్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి బి.వేణుమాధవ్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారన్నారు. ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వై విజయశంకర్ రెడ్డి (నెల్లూరు), ప్రధానకార్యదర్శిగా పి.బాలాజీ (ఉమ్మడి చిత్తూరు), కోశాధికారిగా కే.వీరభద్ర స్వామి (తూర్పుగోదావరి), ఉపాధ్యక్షులుగా ఏవి.శ్రీనివాసరావు (పశ్చిమగోదావరి), జె.శ్రీనివాసరావు (విశాఖపట్నం), టి.శ్రీనివాసరావు (విజయనగరం), కే.గౌస్ మొహిద్దీన్ (అనంతపురం), బి.శివ నారాయణరెడ్డి (కడప), సంయుక్త కార్యదర్శులుగా పి.మురళి, కే.బాల మద్దిలేటి, ఈ. శివశంకర్, ఐ. రమేష్ బాబు (నెల్లూరు), కే.సూరిబాబు (ఈస్ట్ గోదావరి) ఎన్నికయ్యారన్నారు. బాల్‌బాడ్మింటన్ అభివృద్ధికి నూతన కార్యవర్గం అవిరళ కృషి చేస్తుందన్నారు.

చివరి దశకు రెవెన్యూ సదస్సులు

చిత్తూరు కలెక్టరేట్:జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ గ్రామ సదస్సులు చివరి దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ నెల 8వ తేదీతో రెవెన్యూ గ్రామ సదస్సులు ముగియాల్సి ఉంది. అయితే పలు కారణాలతో జిల్లాలోని 16 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సదస్సులు నిర్వహించలేకపోయారు. ఈ నెల 8వ తేదీతో జిల్లాలోని 822 రెవెన్యూ గ్రామాలకుగాను 806 గ్రామాల్లో సదస్సులను పూర్తి చేసినట్లు అధికారులు ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న 16 గ్రామాల్లో సదస్సులు పూర్తి చేస్తే గ్రామ సదస్సులు వంద శాతం పూర్తి అవుతాయి. ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సుల్లో 10,242 అర్జీలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందజేశారు. అయితే వాటిలో 400 అర్జీలు పరిష్కరించారు. కాగా 9,842 అర్జీలు ఇంకా అధికారులు పరిష్కరించాల్సి ఉంది.